క్లుప్తంగా

ఉపాధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: గ్రామాల్లో వలసలు నివారించేందుకే ప్రభుత్వం ఉపాధి హామీ పథకం పనులు చేపడుతోందని జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ అన్నారు. కొఠారీ పంచాయతీ పత్రివుట్టుగలో రూ.7లక్షల 90 వేలతో సన్నజక్కర చెరువులో చేపట్టనున్న అభివృద్ధి పనులను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ జాబ్ కార్డులు అందివ్వాలని, వంద రోజుల పని కల్పించడంతోపాటు రోజుకు రూ.270 వేతనం గిట్టుబాటయ్యేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దుక్క ధనలక్ష్మి, క్షేత్రసహాయకుడు లక్కోజీ రవికుమార్, వీఆర్వో ఉప్పాడ రాజారెడ్డి పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న వైద్యులు

మందస: మందస పీహెచ్‌సీలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాగోలులోని జెమ్స్ ఆస్పత్రికి చెందిన కార్డియాలజిస్ట్ డాక్టర్ బరాటం సాయితేజ, జనరల్ మెడిషన్ డాక్టర్ వి.జ్యోత్స్న రోగులకు పరీక్షలు నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. వీరిలో 20 మందికి చికిత్సలు అవసరమని గుర్తించారు. ఎంఏఎం రాపాక తిరుపతిరావు, అసిస్టెంట్ మేనేజర్ బి.చిన్నారావు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

శివాలయంలో జలాభిషేకాలు

కవిటి: వర్షాలు సమృద్ధిగా కురియాలని, పాడి పంటలతో అన్నదాతలు ఆరోగ్యంగా ఉండాలని కాంక్షిస్తూ ప్రగడపుట్టుగ గ్రామంలోని రామేశ్వరాలయంలో సోమవారం జలాభిషేకం నిర్వహించారు. సంస్కృతాంధ్ర పండితుడు బల్లెడ యజ్ఞానంద్ ఆధ్వర్యంలో ధర్మకర్తలు బెందాళం రాంప్రసాద్ దంపతుల నేతృత్వంలో ఏకాదశరుద్రాభిషేకం చేపట్టారు. అనంతరం శివాలయంలో ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ, కొరికానపుట్టుగ, గొంద్యాలపుట్టుగ గ్రామాలకు చెందిన భక్తులు శివునికి వెయ్యి బిందెళనీటితో అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుడు జగన్‌రాళో పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా జలాభిషేకాలు జరిగాయి.


మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదల

కవిటి: రాజపురంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో చేరేందుకు ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాల్ని సోమవారం విడుదల చేసినట్టు ప్రిన్సిపాల్ యు.ఈశ్వరరావు తెలిపారు. ఫలితాల వివరాలను నోటీసు బోర్డులో అతికించామన్నారు. ఎంపికైన విద్యార్థులు సంబంధిత పత్రాలను తీసుకుని పాఠశాలలో నేరుగా ప్రవేశాలు పొందవచ్చన్నారు. ఆరో తరగతిలో చేరేందుకు 80 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే ఇంటర్మీడియెట్ ప్రవేశాల్ని కూడా ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ చెప్పారు.

నిరుపేదలకు వస్త్ర, అన్నదానం

టెక్కలి: కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా ఆ పార్టీ నాయకులు సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ జంక్షన్‌లో సుమారు 40 మంది నిరుపేదలకు వస్త్ర, అన్నదానం చేశారు. నాయకులు పేడాడ పరమేశ్వరరావు, కోత మధుసూదనరావు, పొట్నూరు ఆనంద్ మాట్లాడుతూ.. ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కె.గోపాలకృష్ణ, టి.వినయ్, పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై దర్యాప్తు చేయండి



వినతులు స్వీకరిస్తున్న రాహుల్‌కుమార్‌రెడ్డి

టెక్కలి: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో టెక్కలి ఎన్టీఆర్ కాలనీలో కొంతమంది ఉద్యోగస్తులకు ఇచ్చిన ఇంటి స్థలాలపై దర్యాప్తు చేయాలని పట్టణానికి చెందిన యు.తమ్మయ్య టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి సోమవారం నిర్వహించిన స్పందనలో ఫిర్యాదు చేశారు. నెయ్యిల రామారావు ఆర్టీసీలో పని చేస్తూ తప్పుడు ధ్రువపత్రాలతో రెండు ఇంటి స్థలాలు మంజూరు చేయించుకొని భారీ భవనాలు నిర్మాణం చేసుకున్నారని.. దీనిపై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వాటిని రద్దు చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంత మంది దిగువ స్థాయి రెవెన్యూ అధికారుల ప్రోత్సాహంతో ఉన్నతాధికారుల ఆదేశాలు భేఖాతరు చేస్తూ స్థలాలను వదడటం లేదన్నారు. ఆ ఇంటి స్థలాలను పేదలకు అందజేయాలని కోరారు. గోపీనాథపురంలో ఆక్రమణలకు గురవుతున్న శ్మశానవాటికకు రక్షణ కల్పించాలని కేఎస్‌పీఎస్ నాయకులు బి.ప్రభాకరరావు కోరారు. కూర్మనాథపురం వద్ద ఉన్న కంచిపోలమ్మ ఆలయానికి పోర్టు రోడ్డు ప్రభావం లేకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బగాది హరి విన్నవించారు.

రైతు సంక్షేమంపై ప్రత్యేకదృష్టి



నందిగాం: వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న పేరాడ తిలక్

నందిగాం: రైతు సంక్షేమంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. అందులో భాగంగానే ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే సకాలంలో విత్తనాలను రైతుల ఇంటి వద్దకే చేరవ చేస్తున్నారన్నారు. నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తితో కలిసి రాయితీ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల రైతాంగానికి అవసరమైన వరి విత్తనాలతో పాటు ఎరువులు, క్రిమి సంహారక మందులు రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని.. రైతులు వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాయవలసి వచ్చేదని.. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రైతుల వద్దకే వెళ్లి విత్తనాలు అందజేస్తున్నారన్నారు. పంపిణీ కార్యక్రమంలో నందిగాం వీఏఏ ఆరవింద్, నాయకులు చిన్ని జోగారావు, మడపాల సంజీవరావు, తమిరె దేవేంద్ర, హనుమంతు బుజ్జి, బొచ్చు కృష్ణారావు పాల్గొన్నారు.

టెక్కలి: టెక్కలి మండలంలోని పలు గ్రామాల్లో విత్తనాల పంపిణీ ప్రక్రియ ప్రారంభమైంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీతో విత్తనాలను రైతులకు అందజేశారు.అక్కవరం ఆర్‌బీకేలో సర్పంచ్‌లు జి.మోహన్‌రెడ్డి, పి.అప్పలనాయుడు, కె.కొత్తూరు ఆర్‌బీకే పరిధిలో సర్పంచ్‌లు ఎం.శంకర్, వి.తవిటయ్య ఆధ్వర్యంలో విత్తనాలను పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖా సిబ్బంది పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: సబ్సిడీ వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని నౌపడ రైతుభరోసా కేంద్రంలో సర్పంచ్ పి.బృందాదేవి ప్రారంభించారు. విత్తనాలతో పాటు ఎరువులు, క్రిమిసంహారక మందులు ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్నాయన్నారు. పీఏసీఎస్ డైరెక్టర్ పి.రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కవిటి: రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ నర్తురామారావు అన్నారు. ఆర్.బెలగాం ఆర్బీకే పరిధిలోని రైతులకు వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న పంట రుణాలను కూడా సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంచాయితీ నాయకులు మద్దిలి ఈశ్వరరావు, బుడ్డ వాసుదేవరావు, ధూపాన నేతాజీ ఉన్నారు.



టెక్కలి: కె.కొత్తూరులో విత్తనాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్‌లు శంకర్, తవిటయ్య



కవిటి: విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు



సంతబొమ్మాళి: విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

పల్లెల అభ్యున్నతికి కృషి

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి సీదిరి అప్పలరాజు

మందస: పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. గ్రామ స్వరాజ్యం దిశగా గ్రామీణ ప్రాంతాలు పయనిస్తున్నాయన్నారు. బాలిగాం పంచాయతీలో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. సర్పంచ్ తలగాన చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో జరిగిన అభివృద్ధి, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించడంతోపాటు రాష్ట్రాన్ని ప్రగతిబాటలో నడిపిస్తున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూపొందించిన నవరత్నాల పథకాలు సత్ఫలితాలిచ్చాయన్నారు. అంతకుముందు రంగనాథపురం, వీరభద్ర గ్రామాల్లో రహదారులను మంత్రి ప్రారంభించారు. బాలిగాంలో రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు.

ప్రతీది రాజకీయం తగదు

మందస ఎంపీపీ డొక్కరి దానయ్య, స్థానిక సర్పంచ్ తలగాన చంద్రశేఖర్ మాట్లాడుతూ.. టీడీపీ నాయకులు ప్రతీ వ్యవహారాన్ని రాజకీయం చేస్తున్నారని, ఇది వారి అవివేకానికి నిదర్శనమన్నారు. రహదారికి అడ్డంగా ఉండడంతో టీడీపీ జెండా దిమ్మను ఎవరో తొలగించారని, దీన్ని రాజకీయాలకు ఆపాదించడం సరికాదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు నవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీలు సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, పలాస మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, వ్యవసాయాధికారి నాగరాజు, సీడీపీవో కె.వసుంధరాదేవి, పశు వైద్యాధికారి డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ శంకర్‌దాసు, ఏఈలు కణితి కృష్ణారావు, గార రామ్మోహనరావు, జి.ప్రసన్నకుమార్, నాయకులు వల్లభ హరికృష్ణ, గున్న నారాయణ, తిరుపతిరావు, పిన్నింటి జోగారావు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం

- జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



కార్యక్రమం నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ విజయ, సమన్వయకర్త సాయిరాజ్

సోంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమం చేరువైందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోంపేట సచివాలయం-1 పరిధిలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబానికి చేకూరిన లబ్ధిని తెలియజేసి బ్రోచర్లను అందజేశారు. సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. అనంతరం విజయ, సాయిరాజ్ మాట్లాడుతూ.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందజేస్తున్న ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతోందన్నారు. కార్యక్రమంలో సోంపేట, కంచిలి ఎంపీపీలు డాక్టర్ నిమ్మన దాస్, పైల దేవదాస్‌రెడ్డి, సోంపేట సర్పంచ్ నగిరి ప్రభావతి, ఎంపీటీసీ సభ్యుడు పాడుగు కామేష్, ఉప సర్పంచ్ మల్లా వెంకటరమణ, నాయకులు శిలగాన భాస్కరరావు, రవి, బాలరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిష్టాత్మకంగా 'జగనన్న సురక్ష'



కవిటి: సిబ్బందికి సూచలిస్తున్న అధికారులు

కవిటి: రాష్ట్ర ప్రభుత్వం గ్రామస్థాయిలో అందిస్తున్న తొమ్మిది సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఉద్దేశించిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ పి.శేఖర్, ఎంపీడీవో పి.సూర్యనారాయణ కోరారు. కార్యక్రమం విధివిధానాలపై గ్రామసచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలు, డిజిటల్ అసిస్టెంట్లతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో జూలై ఒకటో తేదీ నుంచి గ్రామస్థాయిలో గ్రామవలంటీర్లకు, గృహసారథులకు ఈ అంశంపై సచివాలయ స్థాయిలో అవగాహన కల్పిస్తారన్నారు. వారం రోజుల పాటు తొమ్మిది సర్వీసులపై అవసరమైన వారికి ప్రత్యేక సేవలందించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహి, డీటీ పి.రామచంద్రరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని 27 సచివాలయాల పరిధిలో జూలై ఒకటి నుచి ప్రారంభంకానున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సచివాలయాల కన్వీనర్ల మండల ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు, మండల విప్ బొడ్డు అప్పన్న, సర్పంచ్ సుంక జనార్దన కోరారు. కొత్తపేటలో వారు విలేకరులతో మాట్లాడారు.

ఇచ్ఛాపురం రూరల్: సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పించే దిశగా ఈ నెల 23 నుంచి జూలై 23 వరకు చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తహసీల్దార్ పి.మీనాకుమారి కోరారు. మండల స్థాయి అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీడీవో కె.రామారావు, ఉప తహసీల్దార్ సదాశివుని గురుప్రసాద్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: జగనన్న సురక్ష కార్యక్రమంపై సిబ్బందితో ఎంపీడీఓ సీహెచ్ ఈశ్వరమ్మ సమీక్షించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్, డిజిటల్ అసిస్టెంట్లు భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డీటీ వి.గిరిరాజ్, ఈఓపీఆర్డీ డి.తిరుమలరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నెలరోజుల పాటు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై చర్చించారు. కార్యక్రమంలో ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎంఈవో-2గా చిట్టిబాబు



చిట్టిబాబుకు స్వాగతం పలుకుతున్న పీఆర్‌టీయూ ప్రతినిధులు

కంచిలి: మండల విద్యాశాఖాధికారి -2గా జలంత్రకోట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుంబి చిట్టిబాబు నియమితులయ్యారు. ఈయన సోమవారం విధుల్లో చేరారు. ఇతనికి మండల పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నగిరి శరత్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు దుద్ది బాలరాజు తదితరులు స్వాగతం పలికారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

కంచిలి: గ్రామీణ అభివృద్ధికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. కొల్లూరు పంచాయతీ పరిధి కర్తలి, కొల్లూరు, అరవసరియాపల్లి గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన అభివృద్ధి పనులకు సోమవారం భూమి పూజ చేశారు. కర్తలి, కొల్లూరులో రూ. 3 లక్షలు, అరవసరియాపల్లిలో రూ. 4 లక్షలతో ప్రజా విశ్రాంతి భవనాలను నిర్మించనున్నారు. కొల్లూరులో రూ. 1.5 లక్షల ఎంపీపీ నిధులతో రచ్చబండ నిర్మాణానికి భూమి పూజలు చేశారు. పార్టీ నాయకులు పైల లక్ష్మీనారాయణ, వజ్జ మృత్యుంజయరావు, లడ్డుకేశవపాత్రో, గుమ్మడి రామదాసు, దుర్గాసి ధర్మారావు పాల్గొన్నారు.

తక్షణసాయం అందజేత

కాశీబుగ్గ: మాకనపల్లి గ్రామానికి చెందిన రాపాక షణ్ముఖరావు ఇటీవల చనిపోయారు. ఆ కుటుంబానికి వైఎస్సార్‌బీమా ద్వారా తక్షణ సాయంగా రూ.పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని సర్పంచ్ సైని దేశయ్య, ఎంపీటీసీ సభ్యుడు కోరాడ ధనరాజు బాధిత కుటుంబానికి అందజేశారు.

కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందాలి



టెక్కలి: గూడేంలో రైతులకు సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కల్పిస్తున్న రంగారావు

టెక్కలి: కౌలు రైతులందరూ పంట సాగుదారు హక్కు పత్రం పొందడం ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రైతు సంక్షేమ పథకాలను అందుకోవాలని టెక్కలి మండల వ్యవసాయాధికారి కె.రంగారావు సూచించారు. గూడేం, నరసింగపల్లి గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో సోమవారం కౌలురైతుల గుర్తింపు గ్రామ సభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కౌలు రైతులకు ఇవ్వనున్న గుర్తింపు పత్రంపై భూ యజమానులు ఎటువంటి అపోహలకు గురి కావద్దన్నారు. కేవలం 11 నెలల కాల పరిమితి వ రకు మాత్రమే కార్డు వినియోగంలో ఉంటుందని పేర్కొన్నారు. భూ యజమానికి 2.30 ఎకరాల భూమి ఉండాలని, వాటిలో ఒక ఎకరా కౌలుకు ఇచ్చిన వారికి మాత్రమే హక్కు పత్రం వర్తిస్తోందని వివరించారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో హక్కు పత్రం వివరాలు నమోదు చేస్తారని వెల్లడించారు. ఈ హక్కు పత్రం వలన సాధారణ రైతుల మాదిరిగా కౌలు రైతులకు అన్ని రకాల రైతు సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పి.సంతోషమ్మ, ఎస్.సింహాచలం, ఆర్.జయమోహన్, పి.రాకేష్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

నందిగాం: కాపుతెంబూరులో భూ యజమానులు, కౌలు రైతులతో అవగాహన కార్యక్రమాన్ని అధికరాలు నిర్వహించారు. వ్యవసాయశాఖాధికారి శ్రీకాంత్‌వర్మ, డీటీ భాగ్యలక్ష్మీ, సర్పంచ్ పోలాకి మోహనరావు పాల్గొన్నారు.

సోంపేట: బారువ,గొల్లగండి పంచాయతీల్లో సాగు హక్కు పత్రాలపై అవగాహన కల్పించ వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి, సర్పంచ్‌లు యర్ర రజనీ, నాగం భాస్కరరావు పాల్గొన్నారు.

ఘనంగా దువ్వాడ శ్రీధర్ జన్మదిన వేడుకలు



శ్రీధర్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు, అభిమానులు

కాశీబుగ్గ: పలాస పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది దువ్వాడ శ్రీధర్ (బాబా) జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. పలాస శివాజీనగర్ షిర్డీ సాయిబాబా మందిరం సమీపంలోని తన స్వగృహంలో శ్రీధర్‌ను అభిమానులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నాయకులు నవీన్ చౌదరి, బిరాటి వల్లభ, కూన హేమాచలం, హేమసుందర్, శివకుమార్, వినోద్‌కుమార్, కాళిదాసు, బోలుపద్ర గోపి, కిల్లి ఆనంద్, మూల దయాకర్, తిరునగరి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులతో చర్చించిన దువ్వాడ వాణి



హౌసింగ్ పీడీ గణపతిరావుకు సమస్యలు వివరిస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: టెక్కలి నియోజకవర్గంలోని హౌసింగ్, మంచినీటి సమస్యలను జిల్లాస్థాయి అధికారుల దృష్టికి వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి సోమవారం తీసుకెళ్లారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం, బిల్లుల మంజూరుపై హౌసింగ్ పీడీ ఎన్.గణపతిరావును కలిసి చర్చించారు. అలాగే జగనన్న కాలనీల్లో మంచినీటి సదుపాయాలు, గ్రామాల్లో మంచినీటి పథకాల ఏర్పాటుపై ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ శ్రీనివాస్‌తో మాట్లాడారు.

ప్రతిభకు ప్రోత్సాహంతో మరిన్ని విజయాలు



కవిటి: ఆర్.బెలగాంలో అవార్డులు అందజేస్తున్న ఎమ్మెల్సీ రామారావు



మందస:విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం



సంతబొమ్మాళి:విద్యార్థులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

- ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా మరిన్ని విజయాలు సాధ్యమని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఆర్.బెలగాం, బిగొనపపుట్టుగ, కవిటికొత్తపాలెం కేజీబీవీల్లో టెన్త్ పరీక్షల్లో మంచిమార్కులు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు అవార్డులతో సోమవారం సత్కరించారు. ఏఎంసీ చైర్మన్ నూతలపాటి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

మందస: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, మందస పీఏసీఎస్ చైర్మన్ అగ్గున్న సూర్యారావు, సిరిపురం సర్పంచ్ హేమలతసాహు, పొత్తంగి మాజీ సర్పంచ్ దల్లి జానకిరావురెడ్డి అన్నారు. పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో వారు మాట్లాడారు. విద్యార్థులు జగన్నాథ్‌పండాపాత్రో, నాగ నవీన్, జస్వంత్‌పాణిగ్రాహి, ఎస్.మనీషాలకు నగదును అందజేశారు. నాయకుడు సూర్యనారాయణసాహు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ శివకుమార్ మహంతి, ప్రధానోపాధ్యాయుడు నగిరి తారకేశ్వరరావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: బోరుభద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు జి.హేమబిందు, చెక్క స్వరూప, పి.కౌసల్యలకు బహుమతులు అందజేశారు. స్థానిక సర్పంచ్ బుసకల లక్ష్మీకాంతం, ప్రధానోపాధ్యాయులు పాగోటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతాడ చిన్నారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోంపేట: పోటీతత్వంతోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద అన్నారు. పలాసపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించి.. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. సర్పంచ్ తడక జోగారావు, ఎంపీటీసీ సభ్యుడు పోలాకి రమణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు బల్ల హరికృష్ణ పాల్గొన్నారు.



సోంపేట: బహుమతులు అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు యశోద



టెక్కలి: విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న దృశ్యం

టెక్కలి: టెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి ఉత్తమ మార్కులు సాధించిన ఆళ్ల గీత, పోలూరు యశస్విని, లక్కోజు వైష్ణవిలను జగనన్న ఆణిముత్యాలు అవార్డులతో సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎన్ శోభారాణి, విద్యాకమిటీ సభ్యు వి.గోపాలక్రిష్ణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

క్రికెట్ జట్టుకు ఏకరూప దుస్తులు వితరణ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 28వవార్డు పరిధిలో ఉన్న జగజ్జీవన్ క్రికెట్ జట్టుకు ఏకరూప దుస్తులను వితరణ చేశారు. జంట పట్టణాల్లో వివిధ టోర్నమెంట్లలో విజేతలుగా నిలుస్తుండటంతో వారిని అభినందిస్తూ మున్సిపల్ సచివాలయ కన్వీనర్ బడగల బళ్లయ్యనాయడు, వైఎస్సార్‌సీపీ స్పోక్స్‌పర్సన్ శిష్టు గోపిలు దుస్తులను వితరణగా అందించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం: పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు మంగళవారం మంచినీటి సరఫరాను నిలిపివేస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ ఎస్.రమేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల బాహుదానది వంతెన పైనుంచి గ్రానైట్ రాయితో లారీ వెళ్లడంతో వంతెన కూలిపోయింది. గ్రానైట్ రాయిని తొలగించే ప్రక్రియలో పట్టణానికి నీటిని సరఫరా చేసే పైపులైన్ పాడైంది. వీటిని బాగు చేస్తున్నందున నీటి సరఫరాకు అంతరాయం తలెత్తనుందని.. ప్రజలు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాది మృతికి సంతాపం

టెక్కలి: టెక్కలికి చెందిన న్యాయవాది బొడ్డేపల్లి మన్మథరావు ఆకస్మికంగా మృతి చెందారు. ఈయన మృతి పట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివ్వల వివేకానంద, సభ్యులు సోమవారం సంతాపం తెలియజేశారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ

నందిగాం: కణితూరులో కొద్ది రోజులుగా నిర్వహిస్తున్న రాకేష్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ ముగిసింది. విజేతగా పూండీకి చెందిన సచిన్ స్పోర్ట్స్ టీమ్ నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్‌లో కణితూరు జట్టుపై సచిన్‌స్పోర్ట్స్ జట్టు విజయం సాధించింది. బహుమతి ప్రదానోత్సవంలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. విజేతగా నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేలు నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.7 వేలు నగదును తిలక్ అందజేశారు. ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, వైస్ ఎంపీపీ సువ్వారి వసంత్‌కుమార్, నాయకులు కురమాన బాలక్రిష్ణారావు, చిన్ని జోగారావు పాల్గొన్నారు.

జగన్నాథస్వామికి పూజలు

ఇచ్ఛాపురం: పట్టణంలోని జగన్నాథస్వామి ఆలయంలో స్వామివారికి నేత్రోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. గడచిన 15 రోజులుగా చీకటి గదికి పరిమితం చేసిన స్వామివార్లకు సహజసిద్ధమైన వర్ణాలు, చెట్ల నుంచి సేకరించిన పసర్లు, జిగుర్లు, పుష్పాలు, కొన్ని రకాలు పిండి పదార్థాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై ఫిర్యాదు

నందిగాం: కొత్తగ్రహారం పంచాయతీ వజ్జీలపేటలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ వై.ఎ.పద్మావతికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆక్రమించిన స్థలాన్ని శ్మశాన వాటిక, జగనన్న కాలనీ ఇంటి స్థలాలను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సర్వే చేయాలని సర్వేయర్, వీఆర్వో, ఆర్ఐలను తహసీల్దార్ ఆదేశించారు.

గుర్తింపు కార్డుల నమోదు వేగవంతం

వజ్రపుకొత్తూరు: కౌలు రైతుల గుర్తింపు కార్డుల నమోదు వేగవంతం చేయాలని పలాస ఆర్డీఓ సీతారామ్మూర్తి అన్నారు. సైనూరు సచివాలయాన్ని సోమవారం సందర్శించారు. కౌలు రైతుల గుర్తింపు సమయంలో జారీ చేసిన మార్గదర్శకాలను వీఆర్ఓలు, వ్యవసాయశాఖ అధికారులు విధిగా పాటించాలన్నారు. తహసీల్దార్ ఇ.అప్పలస్వామి, ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ, వ్యవసాయాధికారి పి.కిరణ్ వాణి ఉన్నారు.